సాక్షి
మహబూబాబాద్
శనివారం । 25 । మార్చి । 2023



పట్టు పరిశ్రమకు తెలంగాణ..

పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. - 8లో▸



'గజ్జల' గ్రంథాలయం..

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ఆచార్యులు గజ్జల రామేశ్వరం ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాల భాండాగారాన్ని ఏళ్లు శ్రమించి నిర్మించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0°/23.4°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
శని 6:34	ఆది 4:54

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నర్సరీ పరిశీలన



కురవి: సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలోని నర్సరీని శుక్రవారం అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని మానుకోట మాతా శిశు మాసోత్సవాలను నిర్వహిస్తుండగా ఆమె వెళ్లి సందర్శించారు. అంగన్‌వాడీ టీచర్ల మధ్యలో కూర్చొని గర్భిణులు, చిన్నారులను పలకరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ పథకంపై సమీక్షించారు. వేసవికాలంలో ఉపాధి హామీ పథకంలో పనులకు వచ్చే కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ యానాల గంగాధర్‌రెడ్డి, ఎంపీడీఓ సరస్వతీ, ఎంపీఓ, ఏపీఓ యాకాంబ్రం, ఈసీ శైలా, స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రవికుమార్, ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తగ్గుతున్న మిర్చి ధర



కేసముద్రం: మండలంలోని వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర రోజురోజుకూ తగ్గుతోంది. ఒక్కరోజు వ్యవధిలోనే క్వింటా మిర్చికి రూ.1,500 వరకు ధర తగ్గింది. మార్కెట్‌లో ఈనెల 17న మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.23,790, కనిష్ట ధర రూ.16,511 పలుకగా, ఈ నెల 23న క్వింటా మిర్చికి గరిష్ట ధర రూ.23,500, కనిష్ట ధర రూ.17,889 పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 600బస్తాల మిర్చి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.22,011, కనిష్ట ధర రూ.17,055 పలికింది. ఒక్కరోజులోనే మిర్చికి దాదాపు రూ.1,500 వరకు రేటు తగ్గింది. కాగా రోజురోజుకూ మిర్చి ధర తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే క్వాలిటీ మిర్చి రాకపోవడంతో ధర తగ్గుతున్నట్లు వ్యాపారవర్గాలు తెలుపుతున్నాయి.


మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ




బాధ్యతలు స్వీకరిస్తున్న రాజు

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సెక్రటేరియట్‌లో పనిచేస్తున్న రాజును మరిపెడ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాజు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కేసముద్రం మార్కెట్ చైర్‌పర్సన్‌గా సుహాసిని



సుహాసిని, చైర్‌పర్సన్



రవి, వైస్ చైర్మన్

కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీని నియమిస్తూ ఏపీసీ రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు శుక్రవారం తెలిపారు. మార్కెట్ చైర్‌పర్సన్‌గా కేసముద్రంవిలేజ్‌కి చెందిన నీలం సుహాసిని నియామకమయ్యారు. వైస్ చైర్మన్‌గా రాంపల్లి రవి, కమిటీ మెంబర్లుగా సంకు శ్రీనివాస్‌రెడ్డి, జాటోతు హరీశ్‌నాయక్, కూన భద్రాద్రి, గొండ్ల యాదగిరి, పెద్దగోని నాగమణి, గంట్ల మహిపాల్‌రెడ్డి, ముదిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లబోయిన లింగమ్మ, పిల్లి శ్రీరాములు, షేక్ అబిబుద్దీన్, వోలం మురళీ, అనుమాండ్ల వేణుగోపాల్‌రెడ్డి నియామకమైనట్లు తెలిపారు.

శఠగోపం!



వందలాది ఎకరాల దేవుడి మాన్యం అన్యాక్రాంతం

- రాజకీయ నాయకుల అనుచరులే కబ్జాదారులు
- కబ్జాకు గురైన భూముల జాబితా సిద్ధం
- సర్వే చేసి హద్దులు పెట్టేందుకు కసరత్తు
- ఎల్లంపేట భూమికి హద్దులు, కురవిలో కొనసాగుతున్న సర్వే
- మిగిలిన చోట్ల సర్వేను అడ్డుకుంటున్న నాయకులు

సాక్షి, మహబూబాబాద్: జిల్లాలో దేవుడి మాన్యాలు అన్యాక్రాంతమవుతున్నాయి. వందలాది ఎకరాలను రాజకీయ నాయకుల అనుచరులు కబ్జా చేస్తున్నా.. దేవాదాయ, ధర్మాదాయ, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా పలువురు నాయకులు, అధికారులు, కబ్జాదారులతో కుమ్మక్కై దందాకు సహకరిస్తున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో తమ వాటా దక్కించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. భూముల అన్యాక్రాంతం విషయంలో ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తూ చర్యలు తీసుకునే ఆస్కారం లేకుండా చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

వందల ఎకరాలు అన్యాక్రాంతం..

రాజుల కాలంలో గ్రామాల్లో వైష్ణవ, శైవ, ఇతర గ్రామ దేవతలకు దేవాలయాలు నిర్మించారు. ఆలయాల నిర్వహణ కోసం వేల ఎకరాల భూములను దేవుడు, అక్కడ పనిచేసే వారిపేరున రాసి ఇచ్చారు. ఆ భూమిని సాగుచేసుకుంటూ.. వచ్చిన ఆదాయంతో జీవనం సాగించాలి. దేవుడికి సేవ చేయాలి. కల్యాణం, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలి. అయితే ప్రస్తుతం దేవాలయాలకు ఆదరణ కరువైంది. చాలా మంది అర్చకులు పట్టణాల బాటపట్టారు. దీంతో దేవుడి భూములకు రక్షణ లేకుండా పోయింది. ఇలా దంతాలపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న 3.7ఎకరాలు, మహబూబాబాద్ పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయానికి చెందిన 2.17ఎకరాలు, కురవి లక్ష్మీనర్సింహస్వామి భూమి, తాళ్లపూసపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయ భూములు, చిన్నగూడూరు దేవాలయ భూములు, నర్సింహులపేట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం భూమి,మాటేడు దేవాలయం భూములు, ఎల్లంపేట, ఇనుగుర్తి, డోర్నకల్, కేసముద్రం ప్రాంతాల్లోని దేవాదాయశాఖ రికార్డుల్లో ఉన్న భూములతోపాటు,గ్రామకంఠం ఇతర భూములు కలిపి 150ఎకరాల వరకు అన్యాక్రాంతమైనట్లు ఆశాఖ అధికారులు గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిసింది.

నాయకుల అండ..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత సాగునీటి ఇబ్బందులు తొలిగిపోవడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో భూములకు రెక్కలు వచ్చాయి. దేవాలయాల భూములు రహదారుల పక్కనే ఉండడంతో కొన్నిచోట్ల మంచి ధర ఉంది. దీంతో ఆ భూములు రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల అండతో కబ్జాకు గురైనట్లు తెలిసింది.అదేవిధంగా కబ్జాదారుల్లో కొందరు ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు ఉండడంతో నివేదిక ఇవ్వకుండా, సర్వే చేయనివ్వకుండా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ప్రచారం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి దేవాలయాల భూముల పరిరక్షణకు పూనుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

భూమి పరిరక్షణకు సర్వే

దేవాలయాలకు చెందిన భూములు అన్యాక్రాంతం కావడం, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం, అధికారులు పట్టించుకోకపోవడంతో దేవాదాయశాఖ అధికారులు భూముల సర్వే మార్గం ఎంచుకున్నారు. దీంతో ఇప్పటికే మరిపెడ మండలం ఎల్లంపేటలో భూమి సర్వే చేయిస్తే 3ఎకరాల భూమి కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కురవిలో సర్వే కొనసాగుతోంది. వీటితోపాటు దంతాలపల్లి, గుండెపుడి, అబ్బాయిపాలెం, ఇనుగుర్తి, తొర్రూరు, నర్సింహులపేట, మహబూబాబాద్, చిన్నగూడూరులోని భూముల లెక్క తేల్చేందుకు సర్వే నిర్వహించాలని దరఖాస్తు చేసుకున్నారు. వీటి తర్వాత గ్రామకంఠం, ఇతర భూముల వివరాలను స్థానికుల సహకారంతో వెలికితీసేందుకు ఆశాఖ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.

సాక్షి 15వ వార్షికోత్సవం



సాక్షి దినపత్రిక పురుడు పోసుకుని 15ఏళ్లు పూర్తయిన సందర్భంగా వరంగల్ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, రిపోర్టర్లు, సిబ్బంది కలిసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సాక్షిలో తమ ప్రయాణాన్ని మననం చేసుకున్నారు.

ఆస్పత్రిలో పరిశుభ్రత పాటించాలి

- సీహెచ్‌సీని తనిఖీ చేసిన కాయకల్ప బృందం



గార్ల సీహెచ్‌సీని పరిశీలిస్తున్న కాయకల్ప వైద్యబృందం

గార్ల: గార్ల సీహెచ్‌సీలో పరిశుభ్రత పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాయకల్ప బృందం డాక్టర్లు రమ్యశ్రీ, శైలజ సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా కాయకల్ప వైద్యుల బృందం శుక్రవారం సీహెచ్‌సీని సందర్శించింది. రెండు నెలల క్రితం రాష్ట్రస్థాయిలో జరిగిన 300 ప్రభుత్వ ఆస్పత్రుల ఇంటర్నల్ అసెస్మెంట్‌లో గార్ల సీహెచ్‌సీ ఎంపికైనట్లు వైద్యులు వెల్లడించారు. తదుపరి పర్యవేక్షణలో భాగంగా ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ కోసం వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆస్పత్రి భవనం, వేస్టేజ్ కంట్రోల్, అంటువ్యాధుల నివారణ, ఆపరేషన్ థియేటర్, ప్రసవ గదులు, ఆస్పత్రిలో పచ్చదనం పరిశుభ్రతను వైద్య బృందం పరిశీలించింది. అనంతరం రోగులతో వైద్యబృందం మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. వీరివెంట ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేష్, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, సిబ్బంది రమ, జ్యోతి, ప్రవీణ, సరిత, నాగమణి, సతీష్, రవి, వినోద్, మల్సూర, ఉషారాణి, ఉమ, వీరేందర్, దేవరాజ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక



వీసీలో పాల్గొన్న కలెక్టర్ శశాంక, అధికారులు

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షయవ్యాధి నిర్మూలనకు వైద్యశాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. ప్రజలు సంఘటితంగా పోరాడితేనే వ్యాధి నియంత్రణ సాధ్యమన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా శాంపిల్స్ సేకరణ లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలన్నారు. రెండువారాల పాటు పొడిదగ్గు ఉన్నవారు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ శశాంక సూచించారు. అనంతరం క్షయవ్యాధి నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందికి, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు కా కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పట్టాలు పంపిణీ చేస్తాం

ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీఓ 58,59కు సంబంధించిన పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ శశాంక అన్నారు. హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి ఉన్నతాధికారులతో కలిసి జీఓ 58,59, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, జీఓ 58,59, పోడుభూముల పట్టాలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. పోడు భూమల హక్కుపత్రాల పరిశీలన వేగవంతం చేశామన్నారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. ఇంటర్ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని, వైకుంఠధామాలు, తెలంగాణ క్రీడాప్రాంగణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీసీలో జిల్లా నుంచి డీఎఫ్‌ఓ రవికిరణ్, అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జిల్లా మీదుగా మరో ఎన్‌హెచ్

- జాతీయ రహదారి ప్రక్రియ వేగవంతం
- జిల్లాలో 76 కిలోమీటర్ల మేర నిర్మాణం
- పదిహేను రోజుల్లో టెండర్ ప్రక్రియ
- త్వరలోనే భూసేకరణ.. ప్రకటన విడుదల
- రూ.675 కోట్లు కేటాయింపు



జాతీయ రహదారి వెళ్లే రోడ్డు ప్రాంతం

మహబూబాబాద్: జిల్లా మీదుగా మరోజాతీయ రహదారి నిర్మాణం కోసం డిజైన్, ఇతర ప్రక్రియలు పూర్తయినట్ల అధికారులు తెలిపారు. కాగా భూసేకరణ కోసం ప్రకటన విడుదల చేశారు. పదిహేను రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు పేర్కొన్నారు. అయితే ఏయే ప్రాంతాల మీదుగా రహదారి వెళ్తుందనే విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. ముందుగానే ఎన్‌హెచ్ రూట్ మ్యాప్ తెలియజేస్తే ఆయా ప్రాంతాల్లో భూయజమానుల నుంచి ఆందోళనలు మొదలై, ఆటంకాలు ఎదురవుతాయనే స్పష్టత ఇవ్వడం లేదు

వలిగొండ టు భద్రాచలం..

వలిగొండ నుంచి భద్రాచలం జాతీయ రహదారి మానుకోట జిల్లా మీదుగా నిర్మాణం చేయనున్నారు. జిల్లాలో సుమారు 76కిలో మీటర్ల మేర నిర్మాణం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. నిర్మాణానికి మొత్తంగా రూ. 675 కోట్లు కేటాయించారు. ఇందులో రోడ్డు నిర్మాణానికి రూ.430కోట్లు, భూసేకరణ, విద్యుత్ స్తంభాల తొలగింపు, ఇతర పనులకు మిగతావి కేటాయించనున్నారు. వేరే జిల్లాల్లో రహదారి పనుల టెండర్లు పూర్తికాగా.. మానుకోటలో ఇంకా టెండర్ దశకు చేరుకోలేదు. మూడు ప్యాకేజీలుగా పనులు జరగనున్నాయి. గౌరెల్లి నుంచి వలిగొండ, తొర్రూరు నుంచి ఇల్లెందు మండలం నెహ్రూనగర్, నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం జంక్షన్ వరకు పనులు జరుగుతాయని అధికారులు తెలిపారు.

జిల్లాలో ఇలా..

ప్రాథమిక సమాచారం ప్రకారం వడ్డెకొత్తపల్లి నుంచి తొర్రూరు బైపాస్, నెల్లికుదురు బైపాస్, మానుకోట బైపాస్, జిల్లా కేంద్రం నుంచి ఇల్లెందు రోడ్డులోని ఆర్తి గార్డెన్ సమీపంలోని రోడ్డుకు కలుపనున్నారు. అలాగే మెయిన్‌రోడ్డు నుంచి నెహ్రూనగర్, అక్కడి నుంచి ఇల్లెందు బైపాస్ మీదుగా కొత్తగూడెం జంక్షన్ వరకు కలుపుతారు.

ప్రశ్నించే గొంతుకలను జైల్లో పెడుతున్నారు..



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ రూరల్: రాజకీయ దురుద్దేశం, కుట్రతోనే రాహుల్‌గాంధీపై కేసు పెట్టారని, ప్రశ్నించే గొంతుకలను జైల్లో పెడుతున్నారని అల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ విభాగం వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లయ్యనాయక్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీని చూసి బీజేపీ భయపడుతుందన్నారు. ప్రధాని మోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని, దేశంలో చీకటి రోజులు నడుస్తున్నాయని అన్నారు. నాడు బ్రిటిష్ పాలకులతో కొట్లాడిన దేశ ప్రజలు నేడు బీజేపీ ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. బీజేపీ కబంధహస్తాల నుంచి దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామని తెలిపారు. దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రశ్నించే గొంతుకలను జైల్లో పెడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం అన్ని వ్యవస్థలను తన చేతుల్లోకి తీసుకుని అందరిని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దెబ్బతిన్న పంటల పరిశీలనకు వచ్చినట్లు లేదని, తన మొహం ప్రజలకు చూపించడానికి వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో మంత్రి కేటీఆర్ పీఏ తిరుపతి హస్తం ఉందని, ఆయనను విచారించాలని డిమాండ్ చేశారు. అలాగే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ నాయక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ నాయక్, కౌన్సిలర్ జగన్, పద్మం ప్రవీణ్, కోడి శ్రీను, భూక్యా రవి, తోట వెంకన్న, నీరుతటి సురేష్, జీలుగుల భాస్కర్, కొత్త ఇంద్రారెడ్డి, యాకూబ్, సంపంగి రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే అవార్డులు

- జెడ్పీ సీఈఓ రమాదేవి



సర్పంచ్‌లు, కార్యదర్శులను సన్మానించిన అధికారులు

మహబూబాబాద్ రూరల్: సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంతో పాటుగా గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దితేనే అవార్డులు వస్తాయని జెడ్పీ సీఈఓ రమాదేవి అన్నారు. హబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయిలో జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం, ఉత్తమ ప్రతిభ కనబరిచిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. మండలంలోని ఏడు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శాలువాలు కప్పి సన్మానించి, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ రమాదేవి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో కూడా మరింత ఉత్సాహంతో సేవలు చేసి అందరి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా మౌనిక, వైస్ ఎంపీపీ ఎల్డి మల్లయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ హరిప్రసాద్, ఏఓ తిరుపతిరెడ్డి, మిషన్ భగీరథ డీఈ శ్యాం గుప్తా, ఏఈలు శ్రీకాంత్, హరీశ్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- మంత్రి సత్యవతి రాథోడ్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయాలనే లక్ష్యంతో కొత్తగూడ, గంగారం మండలాల్లో రూ.8కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు తెలిపారు.

కొత్తగూడ చెరువులకు నీరు..

పాకాల రిజర్వాయర్ నుంచి కొత్తగూడ మండలంలోని అన్ని చెరువులకు సాగు నీరు తరలిస్తామని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ముస్మి నుంచి దుర్గారం రోడ్డు పనుల ప్రారంభిస్తున్న సమయంలో సాగునీరు అందక పంటలు పండడం లేదని, దీంతో పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లాల్సి వస్తోందని ములుగు ఎమ్మెల్యే సీతక్క, తండావాసులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి పాకాల రిజర్వాయర్‌లోని అదనపు నీటి కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాలని కలెక్టర్ శశాంకకు సూచించారు. అనంతరం ఈఎన్‌సీ అధికారులకు ఫోన్ చేసి మండలంలోని చెరువులకు నీటి తరలింపునకు నివేదిక తయారు చేయాలని సూచించారు. నివేదికను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు, రామన్నగూడెంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, అంకన్నగూడెం, మోకాళ్లపల్లి గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ములుగు, మహబూబాబాద్ జెడ్పీ చైర్మన్లు కుసుమ జగదీష్, బిందు, ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్ నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు పుష్పలత, సర్పంచులు రమ, బానోతు సుగుణ, ఐటీడీఏ ఈఈ హేమలత, తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీఓ భారతి పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సత్యవతిరాథోడ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండలంలోని పొగుళ్లపల్లిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు అజ్మీరా మంగమ్మ, సుగుణ, స్వతంత్ర, ఎంపీటీసీలు స్వప్నలింగన్న, మోకాళ్ల సంతోషారాణి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎర్రయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పత్తిపాక గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎర్రయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మిషన్ భగీరథ తాగునీరు, వంట వండే క్రమంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులను పలు సబ్జెక్ట్‌ల్లో ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబాట్టారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎర్రయ్య

భగవంతుడిని విశ్వాసంతో కొలవాలి



పూజలు చేస్తున్న నారాయణమూర్తి

మహబూబాబాద్ రూరల్: భగవంతుడిని విశ్వాసంతో కొలవాలని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని రామాలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గజేంద్రమోక్షంపై ఆయన భక్తులకు ప్రవచనాన్ని అందించారు. భగవంతుడు తన భక్తులను కాపాడుతాడని, నిర్మల భక్తి గొప్పదనాన్ని గజేంద్రమోక్షం తెలియజేస్తుందన్నారు. సీతారామ కల్యాణ వసంత నవరాత్రి ఉత్సవ చైర్మన్ అనిల్ గుప్తా, కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రోగ్రాం కన్వీనర్ గురునాథరావు, కమిటీ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు ఉమా, రవీంద్రగుప్త పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా తయారు చేయొద్దు



సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

ఖానాపురం: గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్‌ అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ మురళీధర్‌ అన్నారు. మండలంలోని నాజీతండా శివారు అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 900 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్‌ ఎస్సై రాజేశ్వరి, హెడ్‌ కానిస్టేబుల్‌ సదానందం, జగదీశ్‌, సంతోశ్‌, స్వర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడితో ప్రేమ.. యువతి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్‌ రూరల్‌: బాలుడితో ప్రేమ వ్యవహారం కారణంగా.. మహబూబాబాద్‌ జిల్లాలో ఓ యువతి పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. 26 ఏళ్ల యువతి, 17 ఏళ్ల బాలుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈవిషయమై కొద్దిరోజులుగా రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈక్రమంలో యువతి శుక్రవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈఘటనపై పోలీసులను వివరణ కోరగా.. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు



వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన భూక్యా వినోదకు గాయాలయ్యాయి. వినోద శుక్రవారం వ్యవసాయ పనుల కోసం బయటకు రాగా.. వీధి కుక్కలు దాడి చేశాయి. వెంటనే ఆమెను వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతోంది.



‘గజ్జల’ గ్రంథాలయం.. ప్రకృతి పరవశం!



రామేశ్వరం ఏర్పాటు చేసిన నేచురోపతి లైబ్రరీ

- అరుదైన పుస్తకాలు సేకరించి నేచురోపతి లైబ్రరీ ఏర్పాటు
- ప్రజా బాహుళ్యంలోకి ప్రకృతి వైద్య విజ్ఞాన సంపద
- పుస్తకాల ప్రదర్శనలు, పరిశోధనలు
- 29న రిటైర్డ్‌ ఆచార్యులు ‘గజ్జల’కు కీర్తి పురస్కారం

విశ్వానికి సంబంధించిన అనంతమైన నిధి అక్కడ దాగుంది. ప్రకృతి అక్షరాల రూపంలో నిక్షిప్తమై ఉంది. ఆధునిక వైద్యానికి సైతం అందని ఎన్నో రుగ్మతలకు పరిష్కారం అక్కడ దొరుకుతుంది. ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాల భాండాగారాన్ని ఏళ్లు శ్రమించి నిర్మించిన కేయూ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ గజ్జల రామేశ్వరం కృషిపై ‘సాక్షి’ ప్రత్యేకం.

- కేయూ క్యాంపస్‌

కేయూ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ రిటైర్డ్‌ ఆచార్యులు గజ్జల రామేశ్వరం. ఆయన అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞాన సంపదను సేకరించారు. మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్యంపై ఉన్న మక్కువతో దేశమంతా తిరిగి అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాలు, జర్నల్స్‌ను సేకరించారు. ప్రకృతి వైద్య సాహిత్య ప్రదర్శనలిచ్చి ప్రజా బాహుళ్యంలోకి వెళ్లేలా కృషి చేశారు. హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలోని బ్యాంకుకాలనీలో తన సొంత భవనంలో జాతీయ ప్రకృతి వైద్య సాహిత్య గ్రంథాలయాన్ని 2018 జులై 24న ఏర్పాటు చేశారు. ఆతర్వాత దాన్ని 2021 జులై 24న అంతర్జాతీయ ప్రకృతి వైద్య విజ్ఞాన సంపదతో అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీగా మార్చారు. గ్రంథాలయంలో ప్రస్తుతం సుమారు 5 వేలకు పైగా.. తెలుగు, ఇంగ్లిష్‌, హిందీ, తమిళ, మరాఠీ, ఉర్దూ, గుజరాతి కన్నడ తదితర భాషల్లో ఆయా ప్రకృతి వైద్య సాహిత్యం అందుబాటులో ఉంది. ఎవరైనా ఇక్కడికి వచ్చి అందులోని ప్రకృతి వైద్య సాహిత్యాన్ని, జర్నల్స్‌ను చదువుకునేందుకు అవకాశం కల్పించారు. ఉచిత ప్రవేశం, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అక్కడే రెండ్రోజులు ఉండేలా వసతి కూడా కల్పిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠకులు వచ్చి చదువుకోవచ్చు. సుమారు వందేళ్ల కిందటి నేచురోపతికి సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్‌, మాసపత్రికలు ఇక్కడి లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి.



జీటీడీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

సదస్సులు.. రికార్డులు..

అరుదైన ప్రకృతి వైద్య సాహిత్యం సేకరించిన ఆచార్య రామేశ్వరంకు 2016లో తెలుగుబుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 1990లో ముంబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో రామేశ్వరం పాల్గొని పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తెలుగులో ప్రకృతి వైద్య నిఘంటువు ఆయన రూపొందించారు. ప్రకృతి వైద్య విజ్ఞాన గ్రంథాల వివరాలను బిబ్లియోగ్రఫీ పుస్తకం రూపంలో తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. మహాత్మాగాంధీ అండ్‌ నేచురోపతి 50 సంవత్సరాల గవర్నమెంట్‌ అండ్‌ పాలిసీస్‌ అండ్‌ ప్రోగ్రామ్స్‌ అంశంపై నూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో రామేశ్వరం సమర్పించిన పరిశోధన పత్రానికిగాను సంబంధిత అధికారుల చేతుల మీదుగా బ్రాంజ్‌మెడల్‌ను అందుకున్నారు. గతేడాది డిసెంబర్‌ 25న హైదరాబాద్‌లో నిర్వహించిన వాజ్‌పేయి జయంతిలో గజ్జల రామేశ్వరంనకు వాజ్‌పేయ్‌ ఫౌండేషన్‌ వారు ప్రతిభా పురస్కారం అందజేశారు.

మ్యూజియంలో పుస్తకాలు

హైదరాబాద్‌లోని నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ మెడిసినల్‌ హెరిటేజ్‌ మ్యూజియంలో రామేశ్వరం సేకరించిన అరుదైన పలు పుస్తకాలను కూడా అందులో ఉంచాలని ఆసంస్థ కోరి కొంత స్థలాన్ని కేటాయించడంతో ఆయన అక్కడి మ్యూజియంలో కొన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

కీర్తి పురస్కారం

వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారికి హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారానికి రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ గజ్జల రామేశ్వరంను ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ఆచార్య భట్టు రమేశ్‌ ప్రకటించారు. ప్రకృతి వైద్య సాహిత్య సేకరణ, లైబ్రరీ ఏర్పాటు, ప్రకృతి వైద్యంలో పరిశోధనలకు గాను ఆ యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందించనుంది. ఈనెల 29న రామేశ్వరం ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

విశ్వవ్యాప్తం చేయాలనే తపన



మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్య విధానాన్ని ప్రజా బాహుళ్యంలోకి విశ్వవ్యాప్తం చేయాలనేది నా తపన. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సేకరించిన అరుదైన పుస్తకాలు, జర్నల్స్‌తో లైబ్రరీని ఏర్పాటు చేశాను. కీర్తి పురస్కారం లభించడం సంతోషంగా ఉంది. గ్రంథాలయం ప్రకృతి వైద్య పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుంది. అందరూ వినియోగించుకోవాలి.

- గజ్జల రామేశ్వరం, రిటైర్డ్‌ ఆచార్యులు

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- మృతురాలు నాలుగు నెలల గర్భవతి



మృతి చెందిన సాయిప్రత్యూష

మరిపెడ రూరల్‌: అత్తింటి కట్నం వేధింపులకు ఓ వివాహిత బలైంది. మహబూబాబాద్‌ జిల్లా మరిపెడ మండలం లక్ష్మాతండా గ్రామ పంచాయతీ పరిధి జామ్లా తండాకు చెందిన సాయి ప్రత్యూష(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జామ్లా తండాకు చెందిన బానోతు మహేశ్‌కు ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన సాయిప్రత్యూష ప్రేమించి మూడేళ్లక్రితం వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో కట్న కానుకల కింద బంగారం, సుమారు రూ.లక్ష ఇచ్చారు. వీరికి 18 నెలల పాప ఉంది. మహేశ్‌ వ్యవసాయ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలి కాలంలో అదనపు కట్నం కోసం భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు తండా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ గొడవలు సద్దుమణగలేదు. దీంతో భర్తతో పాటు అత్త, మామ వేధింపులు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో మరోసారి ఇంట్లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. గురువారం రాత్రి సాయి ప్రత్యూష ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రస్తుతం సాయిప్రత్యూష నాలుగు నెలల గర్భవతిగా అక్కడి వైద్యులు గుర్తించినట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి దరావత్‌ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్‌ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్‌ సిల్క్‌ బోర్డు సభ్యురాలు డాక్టర్‌ భాగ్య
- 300 మంది రైతులకు అవగాహన

జనగామ రూరల్‌: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్‌ సిల్క్‌ బోర్డ్‌ సభ్యురాలు డాక్టర్‌ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్‌ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్‌ సిల్క్‌ బోర్డ్‌ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్‌, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్‌, మంచిర్యాల, వరంగల్‌, హనుమకొండ, కరీంనగర్‌, జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్‌ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేల మందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్‌ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందు సేద్యం వసతి కల్పిస్తున్నారని, రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్‌ బోర్డు శాస్త్రవేత్తలు, వినోద్‌ యాదవ్‌, మీనాక్షి, బీటీ శ్రీనివాస్‌, మొగిలి, హార్టికల్చర్‌ అధికారి లత, వివిధ జిల్లాల నుంచి అధికారులు, రైతులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెంట్రల్‌ బోర్డు సభ్యురాలు భాగ్య, అధికారులు

సాక్షి క్లాసిఫైడ్స్‌

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



గోపాలస్వామి(ఫైల్‌)

లింగాలఘణపురం: రోడ్డు ప్రమాదంలో మండలంలోని నెల్లుట్లకు చెందిన ఉపాధ్యాయుడు సంబోజు గోపాలస్వామి(56) శుక్రవారం మృతి చెందాడు. గోపాలస్వామి జనగామలో ఉంటూ.. మండలంలోని కిష్టగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ద్విచక్రవాహనంపై కిష్టగూడెం పాఠశాలకు బయల్దేరాడు. నెల్లుట్ల వద్ద బ్రిడ్జి దిగుతుండగా.. కుక్క ఎదురుగా రావడంతో ఒక్కసారిగా ముందు బ్రేక్‌ సడన్‌గా వేయడంతో ఎగిరి రోడ్డుపై పడ్డాడు. హెల్మెట్‌ ఉన్నప్పటికీ తలకు, కడుపులో బలమైన గాయాలు కావడంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతిపై మండలంలోని ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంఈఓ చంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

దాచుకున్న డబ్బులు దోచుకున్నారు..

నల్లబెల్లి: గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను ఇంట్లో దాచుకోగా.. గుర్తు తెలియని వ్యక్తులు దోచుకున్నారు. మండలంలోని రుద్రగూడెం గొల్లవాడకు చెందిన మేరుగు శ్రీకాంత్‌ ఇటీవల తనకున్న గొర్రెలను విక్రయించాడు. జీవనోపాధి కోసం టవేరా వాహనాన్ని ఇటీవల కొనుగోలు చేశాడు. గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను వాహనం అప్పు తీర్చాలనుకున్నాడు. గొర్రెలను కొన్న వ్యక్తి శుక్రవారం శ్రీకాంత్‌ వద్దకు వచ్చి నగదు ఇవ్వడంతో ఇంట్లో దాచిపెట్టాడు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి రాగా.. తలుపులు తీసి ఉండడంతో అనుమానంతో ఇంట్లో డబ్బులను చూడగా.. రూ.50 వేలు, తులంన్నర బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందించగా.. క్లూస్‌ టీం బాధితుడి ఇంటికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



శ్రీధర్‌(ఫైల్‌)

ఐనవోలు: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు కాసుగొండ శ్రీధర్‌(34) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన విషయం గమనించిన శ్రీధర్‌ భార్య లక్ష్మి అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతున్న అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఐనవోలు ఎస్సై మాధవ్‌గౌడ్‌ తెలిపారు.

ఆహార ధాన్యాల కృత్రిమ కొరత సృష్టించొద్దు

- హనుమకొండ అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్‌: ఆహార ధాన్యాలను అక్రమంగా నిల్వచేస్తూ కృత్రిమ కొరత సృష్టించవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ధరల నియంత్రణపై సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, అధికారులతో అదనపు కలెక్టర్‌ మాట్లాడుతూ గత నెలకు, ప్రసుత్త నెలకు వస్తువుల డిమాండ్‌ పెరుగుదల పరిశీలించాలన్నారు. డిమాండ్‌ ఉన్న వస్తువులు క్రమంగా నిల్వచేసి ధరలు పెంచే విధంగా వ్యాపారస్తులు చేయవద్దని ఆదేశించారు. అలాంటి వారిపై అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్‌ఓ వసంతలక్ష్మి, డీఎస్పీ రాజు, డీఎంసీఎస్‌ మహేందర్‌, తూనికలు కొలతలు అధికారి అనిల్‌కుమార్‌, వ్యవసాయ అధికారి మురళీమోహన్‌, రైతు బజార్‌ అధికారి షఫియుద్దీన్‌, డీటీసీఎస్‌లు కృష్ణ, సత్యనారాయణ, ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

కూచిపూడి గురువు పద్మజ కన్నుమూత



కుప్పా పద్మజ (ఫైల్‌)

హన్మకొండ కల్చరల్‌ : ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కుప్పా పద్మజ (56) గుండెపోటుతో ఓ సిటిలోని ఆమె స్వగృహంలో గురువారం రాత్రి కన్నుమూశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న పద్మజ గురువారం సాయంత్రం 7 గంటల వరకు విధుల్లో ఉన్నారు. ఆమె మరణ వార్త వినగానే సంగీత కళాశాల సిబ్బంది, వరంగల్‌ ఉమ్మడి జిల్లాలోని సంగీత, నృత్యకళాకారులు, శిష్యబృందం, గురువులు, ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. పద్మజ ఐదేళ్ల వయస్సు నుంచి నాట్యం నేర్చుకున్నారు. వెంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం నిర్వాహకురాలు వెంపటి నాగేశ్వరి వద్ద నృత్యం నేర్చుకున్నారు. 1992లో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అసిస్టెంట్‌ లెక్చరర్‌గా చేరారు. 2014 నుంచి ఇన్‌చార్జ్‌ ప్రిన్సిపాల్‌గా ఐదేళ్లు బాధ్యతలు నిర్వర్తించారు. న్యూఢిల్లీ దూరదర్శన్‌ కేంద్రం నుండి ‘ఏ’ గ్రేడ్‌ కూచిపూడి నాట్య కళాకారిణిగా గుర్తింపు పొందారు. మానవ వనరుల అభివృద్ధి శాఖచే జూనియర్‌ ఫెలోషిప్‌, తెలంగాణ ప్రభుత్వంచే ఉత్తమ నాట్యకారిణిగా అవార్డు 2015లో అందుకున్నారు. మరెన్నో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. నృత్యనాటికలకు దర్శకత్వం వహించారు. వివిధ రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో 500లకు పైగా నృత్య ప్రదర్శనలిచ్చారు.

ప్రముఖుల సంతాపం

పద్మజ మరణం తీరని లోటు అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ భట్టు రమేశ్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌ జానపద, గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్‌ గడ్డం వెంకన్న మాట్లాడుతూ.. కుప్పా పద్మజ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరేళ్లుగా నృత్యంలో పీహెచ్‌డీ సీటు కోసం ప్రయత్నించారని, పీహెచ్‌డీ చేయాలనే చిరకాల కోరిక తీరకుండానే వెళ్లిపోయారని గుర్తు చేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌ సుధీర్‌కుమార్‌, అధ్యాపకులు ఏడిద భీంశంకర్‌, జక్కోజు సత్యనారాయణ, భాస్కర్‌రావు, అనుమూల యోష, సీనియర్‌ అసిస్టెంట్‌ గడ్డం శంకర్‌, పేరిణి నృత్యగురువులు గజ్జెల రంజిత్‌కుమార్‌, నవ్యజ, ఓరుగల్లు శారద నాట్య మండలి సభ్యులు జేఎస్‌ శర్మ, జూలూరి నాగరాజు, వివిధ నృత్య కళా క్షేత్రాల గురువులు సంతాపం తెలిపారు.

కలెక్టరేట్‌ ఎదుట రైతు సంఘాల ధర్నా




అదనపు కలెక్టర్‌ శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్‌ రూరల్‌: జిల్లాలో ఇటీవల కురిసిన వడగళ్లతో వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేల చొప్పున తక్షణ సాయంగా ప్రకటించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎస్‌) జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌ ఎదుట వివిధ రైతు సంఘాల నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు ప్రభుత్వాలు సమగ్ర పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. ముఖ్యమంత్రి గురువారం ఎకరానికి రూ.10వేల చొప్పున ఇస్తామని ప్రకటించారని, అయితే రైతులు ఎకరానికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. సీఎం ప్రకటించిన రూ.10వేలు ఎందుకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. రైతుల పంటలకు బీమా చేయించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్‌ మాట్లాడుతూ రుణమాఫీ పథకం అనేది రాష్ట్రంలో ప్రహసనంగా మారిందన్నారు. ధర్నాలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్‌ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరగోని శంకరయ్య, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్‌, సంయుక్త కిసాన్‌ మహాసభ జిల్లా అధ్యక్షుడు వల్లందాసు కుమార్‌, ఏఐకేఎస్‌ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్‌, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు ప్రభాకర్‌, వెంకటేశ్వరరావు, రాజేందర్‌, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా అప్పారావు, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీని తీసుకెళ్లాలి

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శుక్రవారం హనుమకొండ దీన్‌దయాల్‌ నగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఓబీసీ మోర్చా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్‌ 6 నుంచి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ గ్రామానికి ఓబీసీ... గడపగడపకూ బీజేపీలో మోదీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూడా బీసీ సారథ్యంలోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓబీసీలు బీజేపీకి అండగా నిలువాలన్నారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్‌ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బెజ్జంకి పూర్ణాచారి, గాజుల సంపత్‌, నాయకులు బాసాని సోమరాజు, గడప శివ, నర్మెట్ట శ్రీనివాస్‌, సంతోష్‌, గీల సురేష్‌, నాగవెల్లి గోపి, నవీన్‌, తిలక్‌, బండి సదానందం పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

వరంగల్‌ లీగల్‌: వరంగల్‌ జిల్లా బార్‌ అసోసియేషన్‌ ఎన్నికలు ఈనెల 31న జరగనున్నాయి. శుక్రవారం అంబేద్కర్‌ హాల్‌లో మధ్యాహ్నం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గడువు ముగిసింది. శనివారం అభ్యర్థుల ఉప సంహరణ కార్యక్రమం ముగియడంతో సాయంత్రం పోటీల్లో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నారు. ఏకగ్రీవంగా కిరణ్‌సింగ్‌, విష్ణుకుమార్‌గుప్తా, పద్మలత గౌడ్‌ నియమితులు కాగా.. నామినేషన్‌ వేసిన వారిలో ప్రెసిడెంట్‌గా యం.రమేశ్‌బాబు, పి.సత్యనారాయణ, వై.శ్యాంసుందర్‌రెడ్డి, వైస్‌ ప్రెసిడెంట్‌గా డి.దయానంద శ్రీనివాసన్‌, ఎన్‌.నరేందర్‌ తదితరులున్నారు.